సాక్షి
పల్నాడు

ఆదివారం । 2 । జులై । 2023



మల్లేశ్వరుని సేవలో హైకోర్టు జడ్జి

పెదకాకాని: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం భ్రమరాంబ మల్లేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



శనిత్రయోదశి ప్రత్యేక పూజలు

అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కార్డుదారులకు గోధుమ పిండి

గుంటూరు వెస్ట్: ప్రజల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం బలవర్ధకమైన గోధుమ పిండిని కిలో రూ.16కి అందిస్తుందని జేసీ జి.రాజకుమారి శనివారం తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి కృష్ణానదిలో చేపల వేట నిషేధం

అమరావతి: జిల్లా మత్స్యశాఖాధికారి ఆదేశాల మేరకు నేటి నుంచి మండలంలోని కృష్ణానది పరివాహక గ్రామాలలో నదిలో చేపలవేటపై నిషేధం విధించినట్లు మండల మత్స్యశాఖ పర్యవేక్షకురాలు జి.భాగ్యలత తెలిపారు శనివారం ఆమె మాట్లాడుతూ నదిలో జులై 1వతేదీ నుంచి ఆగస్టు 31వరకు రెండు నెలల కాలం మత్స్య సంపద అభివృద్ధికి, చేపల సంతానోత్పత్తికి అనువైన కాలం కావటంతో వేట నిషేధించామన్నారు. మత్స్యశాఖ సహాయకులు డి.శ్రీనివాసరావు, పి.శివకుమారిల ఆధ్వర్యంలో నిత్యం నిఘా ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపలవేటకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రారంభం



నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక నెల మొదటిరోజే జిల్లాలో 74.83 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో ఈనెల 2,67,544 మందికి రూ.74,22,30,750లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా తొలిరోజు 2,00,215 మందికి రూ.55,51,36,250లను అందజేశారు. వలంటీర్ల తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపుతట్టి బయెమెట్రిక్ ద్వారా పెన్షన్‌ను పంపిణీ చేశారు. తమ ఇంటివద్దకే పెన్షన్ వస్తుండడంపై అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పెన్షన్ కోసం కిలోమీటర్ల కొద్ది నడిచివెళ్లి గంటల పాటు ప్రభుత్వ సిబ్బంది కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటివద్దకే పెన్షన్ అందిస్తూ తమ ఇబ్బందులు తొలగించారని సంతోషం వెలిబుచ్చారు.

వైఎస్సార్ ఉచిత పంటల బీమా విడుదల

గుంటూరు జిల్లాలో 14,542 మంది రైతులకు రూ.4.16 కోట్లు

కొరిటెపాడు(గుంటూరు): వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 2022 ఖరీఫ్‌కు రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు జిల్లాలోని 14,542 మంది రైతులకు రూ.4.16 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాకు సంబంధించి వర్షాధారం కింద పత్తి పంట సాగు చేసిన ప్రత్తిపాడు, ఫిరంగిపురం, మేడికొండూరు, చేబ్రోలు, కాకుమాను మండలాలకు చెందిన 14,542 మంది రైతులు 25,877.62 ఎకరాల్లో పంట నష్టపోయారు. ఈ రైతులు వాతావరణ ఆధారిత బీమా పొందడానికి అర్హులుగా గుర్తించి జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలు ఈ నెల 4వ తేదీవరకు ఆర్బీకేలలో ప్రదర్శిస్తారు. సామాజిక తనిఖీ చేపట్టి రైతుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి 4వ తేదీ సాయంత్రం లోపు ఆన్‌లైన్ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో డీఈఓ పి.శైలజ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియలో హెచ్‌ఎం పోస్టులకు 140 మంది స్కూల్ అసిస్టెంట్లతో పాటు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 280 మంది చొప్పున తరలివచ్చారు. ఆదివారం స్కూల్ అసిస్టెంట్స్ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సీనియార్టీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని డీఈఓ తెలిపారు.





మంత్రి విడదల రజినిని ఘనంగా సత్కరిస్తున్న వైద్యులు, సీనియర్ వైద్యులను సన్మానిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రాణదాతలకు ప్రణామం

- గుంటూరు జీజీహెచ్‌లో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు
- సీనియర్ వైద్యులను సన్మానించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో శనివారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వార్డులో రోగులకు మంత్రి పండ్లు పంపిణీ చేశారు. అక్కడే ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి సందర్శించి, రక్తదాతలతో మాట్లాడారు. అనంతరం డాక్టర్స్ డే వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైద్యులు ఎంతో నిబద్ధతతో పనిచేస్తారని, కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలు అందించారని కొనియాడారు.

మహానేతను స్మరించుకోవాలి..

ఏపీలో డాక్టర్స్ డే నాడు బీసీ రాయ్‌తో పాటు దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని కూడా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యశ్రీ లాంటి ఒక గొప్ప పథకాన్ని తీసుకొచ్చి, దేశానికే ఆ పథకం దిక్సూచిలా చేసిన గొప్ప నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత ఈ దేశంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి విడదల రజిని అన్నారు. నాడు– నేడు కింద ఒక్క గుంటూరు వైద్య కళాశాల, జీజీహెచ్ అభివృద్ధికే ఏకంగా రూ.500 కోట్లు కేటాయించామన్నారు. ఇదే గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో గత ప్రభుత్వ హయాంలో సెల్‌ఫోన్ లైట్ల కింద ఆపరేషన్లు చేయాల్సిన దుస్థితి ఉండేదని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులు అన్ని వసతులతో ఉన్నాయని తెలిపారు.



కార్యక్రమానికి హాజరైన వైద్యులు, వైద్య సిబ్బంది

అభివృద్ధి పథంలో గుంటూరు జీజీహెచ్..

గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. జింఖానా ప్రతినిధుల చొరవతో వచ్చే ఏడాది కల్లా జీజీహెచ్‌లో ఎంసీహెచ్ బ్లాక్‌ను పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. సీఐఏ సహకారంతో రూ. 68 లక్షలతో ఇప్పుడు ఉన్న ప్రసూతి విభాగాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. జింఖానా సహకారంతో మరింతగా ఆస్పత్రిని తీర్చి దిద్దుకునేందుకు ప్రణాళిలు రూపొందిస్తామన్నారు. నాట్కో చొరవతో రాష్ట్రంలోనే నాణ్యమైన క్యాన్సర్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురాగలిగామని, పేదలకు పూర్తి ఉచితంగా అత్యుత్తమ వైద్యం అందిస్తున్నామని వెల్లడించారు.

సీనియర్ వైద్యులకు సన్మానం..

వైద్యరంగంలో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న పలువురు సీనియర్ వైద్యులకు, జీజీహెచ్ అభివృద్ధిలో సహాయ సహకారాలు అందిస్తున్న వైద్యులను ఘనంగా సత్కరించారు. జీజీహెచ్ అభివృద్ధిలో కీలకంగా ఉన్న డాక్టర్ పాదిల ప్రసాద్, డాక్టర్ గంగాలక్ష్మి, నాట్కో ఫౌండేషన్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావుతోపాటు సీనియర్ వైద్యులు బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సుధాకర్, రాజేంద్రప్రసాద్, తారకనాథ్, మద్దినేని గోపాలకృష్ణయ్య, మురళీ బాబూరావు, ఫణిభూషణ్, రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం, కె.ఎస్.ఎన్.చారి, తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తదితరులు మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళ నాయకురాలు ఫాతిమా, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భగవతీ శాకంబరీ..

ప్రకృతిమాతా నమోస్తుతే

- ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం
- దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కమలాసనంపై కూర్చుని తన పిడికిలిలో వరిమొలకలను పట్టుకుని, పుష్పాలు, ఫలాలు, దుంపగడ్డలు ధరించిన శాకంబరీదేవిగా విశేష అలంకారంలో.. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న భక్తజనం మది పులకించింది. ప్రకృతిమాతా ప్రణామం అంటూ అశేష భక్తజనం శాకంబరీదేవి అలంకారంలో ఉన్న జగజ్జననిని వేడుకున్నారు. భక్తులతో క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలయ్యాయి. ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం శాకంబరీదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇవి మూడు రోజులపాటు జరగనున్నాయి. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడుతో పాటు తెలంగాణాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు శాకంబరీదేవిని దర్శనానికి ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఉత్సవాల్లో తొలి రోజు శనివారం సుమారు 70వేల మంది దర్శనానికి వచ్చారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

కలశస్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో కలశ స్థాపనతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. శాకంబరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తుల ఇంట అన్నపానీయాలకు లోటు లేకుండా ఉంటుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. అమ్మవారిని వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో అలంకరించారు. అలయ ప్రాంగణాన్ని కాయగూరలతో ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పలువురు పాలక వర్గ సభ్యులు కట్టా సత్తెయ్య, చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీకృష్ణ, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వేద పండితులు, వైదిక కమిటీ సభ్యులు, ఎఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భక్తానందవిధాయిని.. శాకంబరీదేవికి హారతి

పచ్చగా ఆలయ ప్రాంగణం

ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని కరివేపాకుతో కప్పేశారు. దీంతో అమ్మవారి ఆలయం కరివేపాకు తోటను తలపించింది. భక్తులు పచ్చదనం పరిమళాలతో పులకించారు. వంకాయలు, టమాటా, పొట్లకాయలను ఉపయోగించి చేసిన శివపార్వతుల ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

రికార్డు స్థాయిలో భక్తజనం

శాకంబరీదేవి ఉత్సవాలు, ఆషాఢ మాసోత్సవాలు, శనివారం నేపథ్యలో రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం సుమారు 60 నుంచి 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం కూడా ఇదే స్థాయిలో భక్తుల రద్దీ ఉంటుందని ఆలయ అధికారులు భావిస్తున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు.

అద్భుతం.. కదంబం..

శాకంబరీ ఉత్సవాల్లో అలంకరణ చేసిన కూరగాయలతో తయారు చేసే కదంబ ప్రసాదానికి ప్రత్యేకత ఉంది. ఉత్సవాలకు విచ్చేసే భక్తులు అమ్మవారి దర్శనం తర్వాత అడిగేది.. కదంబ ప్రసాదం పంపిణీ ఎక్కడ అనేదే. పలు రకాల కాయగూరలు, ఆకుకూరలతో తయారు చేసే కదంబం ప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. ఈ ప్రసాదాన్ని ఆలయ ఈవో భ్రమరాంబ భక్తులకు పంపిణీ చేశారు.

ఏసీబీ వలలో గ్రామ సర్వేయర్

రైతు నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

వేమూరు: రైతు వద్ద నుంచి లంచం తీసుకుంటుండగా గ్రామ సచివాలయం సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు శనివారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెరవలి గ్రామానికి చెందిన జువాది వెంకటేశ్వరరావు తన తల్లి కమలమ్మకు చెందిన 1.37 ఎకరాల పొలాన్ని ఆన్‌లైన్ చేసేందుకు సర్వే కోసం పెరవలి గ్రామ సచివాలయంలో ఇటీవల దరఖాస్తు పెట్టుకున్నాడు. గ్రామ సచివాలయం సర్వేయర్ షేక్ షబ్బీర్ పొలం సర్వే చేసి 1.13 ఎకరాల భూమికి సర్వే సర్టిఫికెట్ ఇచ్చాడు. మిగిలిన 24 సెంట్ల భూమి గురించి అడితే రూ.4500 లంచం ఇస్తేనే చేస్తానని సర్వేయర్ షబ్బీర్ తేల్చిచెప్పాడు. దీంతో చేసేదేమి లేక వెంకటేశ్వరరావు ఏసీబీ అధికారులను గత నెల 28న ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు వెంకటేశ్వరరావు చేత గ్రామ సర్వేయర్‌కు రూ.4500 స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇప్పించారు. డబ్బులు తీసుకున్న వెంటనే సర్వేయర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడిలో డీఎస్పీ సత్యనందం, సీఐలు నాగరాజు, రాంబాబు, మన్మథరావు, లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఏసీబీ దాడిలో పట్టుబడ్డ సర్వేయర్ షబ్బీర్

ఐఎంఏ నూతన భవనం ప్రారంభం

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సహాయంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఉండాలని మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని పెద్దచెరువులో సుమారు రూ.1.30కోట్ల వ్యయంతో నిర్మించిన ఐఎంఏ నూతన భవనాన్ని ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదులతో కలిసి మాజీ మంత్రి కాసు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి అధ్యక్షత నిర్వహించిన సభలో కాసు మాట్లాడుతూ పేదలకు వైద్యం అందజేయడంలో పీహెచ్‌సీలు కీలకపాత్ర పోషిస్తాయని, వాటిని నిపుణులైన వైద్యులు అప్పుడప్పుడూ సందర్శించి తగిన సహాయ సహకారాలు అందజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేష్, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ పీఎస్ దత్, డీసీహెచ్ డాక్టర్ బీవీ రంగారావు, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సునీల ప్రసంగించారు. డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియచేశారు. డాక్టర్లు మర్రి పెద్దయ్య, గజ్జల బ్రహ్మారెడ్డి, నాగోతు ప్రకాష్, శనివారపు హనిమిరెడ్డి, పాలూరి శ్రీనివాసరెడ్డి, కేజే మోహన్‌రెడ్డి, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంద్యాల రాంప్రసాదరెడ్డిలతో పాటు పట్టణంలోని పలువురు డాక్టర్లు, ఇంజినీర్ కొమ్మసాని కమలాకరరెడ్డి పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కాసు, కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, కాసు

సేవలకు ‘వంద’నం

- సమస్యలకు వందశాతం పరిష్కారమే ‘జగనన్న సురక్ష’ లక్ష్యం
- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- ఎమ్మెల్యేతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డులు అందజేత

నరసరావుపేట: అర్హత కలిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు మేలు చేయడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 9వ వార్డు సచివాలయ పరిధిలోని మార్కెట్‌యార్డులో శనివారం జగనన్న సురక్ష పథకం అమలు కార్యక్రమ సభలో శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌లతో కలిసి హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ వందశాతం సమస్యలను పరిష్కరించుకొని సంక్షేమ పథకాలను పొందాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఎవరికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా అన్నివర్గాల ప్రజలకు వందశాతం మేలు జరుగుతుందన్నారు. ఈ వార్డులో 92శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మిగతా ఎనిమిది శాతం మంది ప్రజలకు అందజేసేందుకు ఈపథకాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. వలంటీర్లు, ప్రభుత్వ అధికారులు ప్రతి గడపకూ తిరిగి సాంకేతిక సమస్య కారణంగా పథకాలు, ధ్రువీకరణ పత్రాలు అందని ప్రజల వద్దకు వెళ్లి పరిష్కరించడం గొప్ప విషయం అన్నారు. జేసీ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు రానివారు ఉండకూడదన్న లక్ష్యంతో ముందుగానే గడపగడపకు వలంటీర్లు వారం రోజులపాటు తిరిగి సమస్యలను నమోదుచేశారన్నారు. వాటి పరిష్కారం కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయడం, సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. వార్డుకు సంబంధించిన మంజూరుచేసిన 116 ధ్రువీకరణ పత్రాలను జిల్లా కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వ పథకాలు ఆగిపోయిన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా డెస్క్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా డెస్క్‌ను పర్యవేక్షించి ప్రజల సమస్యలను తెలుసుకొని నమోదు చేయించారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, నియోజకవర్గ పరిశీలకుడు ఆతుకూరి ఆంజనేయులు, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, షేక్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆషాబేగం ఖాజావలి, రాష్ట్ర గిరిజన కో–ఆపరేటీవ్, స్వచ్ఛాంధ్ర, ముదిరాజు కార్పొరేషన్ల డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎస్.సుజాతాపాల్, ఇయం.స్వామి, జిల్లా వడియరాజుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు వేముల శివ, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఎ.హనీఫ్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది సింధుకూరి శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్ డి.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి, జేసీ శ్యామ్‌ప్రసాద్, పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్

ప్రతి ఇంటా కుష్ఠు సర్వే

యడ్లపాడు: స్పర్శలేని మచ్చలు.. అనుమానిత కుష్ఠుపై అప్రమత్తత వహించాలని ఏపీ అడిషనల్ డైరెక్టర్ (లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ విభాగం) జొన్నలగడ్డ యాస్మిన్ చెప్పారు. కుష్ఠు సర్వే ప్రక్రియ పరిశీలనలో భాగంగా శనివారం యడ్లపాడు గ్రామాన్ని సందర్శించిన ఆమె స్థానిక యడ్లపాడు–1 గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలకు పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవల్ని పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్ఠు సర్వే ప్రతిఇంటికి వెళ్లి క్షేత్రస్థాయి బృందాలు పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియపై పలు సూచలను అందించారు. యడ్లపాడు మండలం పరిధిలో కుష్ఠు కేసులు కేవలం నాలుగు మాత్రమే ఉన్నట్లు సర్వేలో తేలిందన్నారు. వీరికి ప్రతినెలా ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్నట్లు వెల్లడించారు. డీఎల్ఓ పద్మావతి, డిప్యూటీ డెమో శోభారాణి, డీపీఎంఓ వెంకట్రావు, వైద్యాధికారులు ఉన్నారు.

పశ్చిమగోదావరి జట్టుపై కృష్ణా జట్టు విజయం


భానుప్రసాద్, (62 పరుగులు కృష్ణా జిల్లా బ్యాట్స్‌మెన్)

నరసరావుపేటఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బిఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్‌–19 ఆంధ్ర సెంట్రల్ జోన్ పోటీలలో శనివారం జరిగిన మూడో వన్‌డే మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పశ్చిమగోదావరి జట్టు నిర్ణీత 50 ఓవర్లకుగాను 48.2 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని వి.జస్విన్ 25 బంతుల్లో 43, హర్ష 50 బంతుల్లో 36 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. కృష్ణా జట్టు బౌలర్ ఎల్.చిన్న మూడు వికెట్లు సాధించగా, యోచన్, హనుమ, యశ్వంత్‌లకు రెండు వికెట్లు చొప్పున లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 46 ఓవర్లలో 197 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని భాను ప్రసాద్ 62 పరుగులు, బి.గీత్ 27 పరుగులు సాధించారు. పశ్చిమగోదావరి బౌలర్లు హర్ష మూడు వికెట్లు, సాయితేజ రెండు వికెట్లు సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు. సోమవారం నుంచి మూడు రోజుల టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

- ఏ ఒక్కరూ సంక్షేమానికి దూరంగా ఉండకూడదు.
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పెద్దమక్కెన, గుడిపూడి గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాలు


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఏ ఒక్కరూ సంక్షేమానికి దూరం కాకుండా సంతృప్తికర స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రారంభించామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల పరిధిలోని పెద్దమక్కెన, గుడిపూడి గ్రామాల్లో శనివారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపులలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్యాంపులకు ఆయా గ్రామాల్లో ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్.సురేష్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సచివాలయాల నుంచి 520 రకాల సేవలను, 53 రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. చిన్న చిన్న లోపాలతో ఈ సేవలు పొందలేని వారి వద్దకే వెళ్లి, వారి వినతులు తెలుసుకొని వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలకు అవసరమైన సమాచారం సేకరించి క్యాంపుల వద్ద ఉచితంగా సంబంధిత 11 రకాల పత్రాలను అందించడం, సరికొత్త పరిపాలన విధానమన్నారు. క్యాంపులో తక్షణం పరిష్కారం కాని వాటిని ప్రత్యేకంగా సమయం తీసుకుని నూరు శాతం పరిష్కారం అయ్యేలా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, అధికార గణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గుడిపూడి గ్రామంలో 286 దరఖాస్తులను వలంటీర్లు సేకరించగా 286 దరఖాస్తులకు ధ్రువీకరణ పత్రాలను క్యాంపులో మంజూరు చేసి లబ్ధిదారులకు అందించారు. పెద్దమక్కెన గ్రామంలో 178 దరఖాస్తులు రాగా 163 మంది లబ్ధిదారులకు ఆయా ధృవీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఏపీ డి.సుధాకర్, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య, జేసీఎస్ ఇన్‌చార్జ్ బొంతు వెంకటరెడ్డి, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలక జయపాల్, ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, గుడిపూడి గ్రామ సర్పంచ్ తొరటి తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు రోసిరెడ్డి, మర్రి ఆదిలక్ష్మి, నాయకులు మర్రి పూర్ణయ్య, రామకృష్ణారెడ్డి, వాసు, వేమారెడ్డి, గుడిపూడి పీఎసీఎస్ అధ్యక్షుడు బాపిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కాశిమాల ఓబయ్య, కాశిమాల మార్క్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక శిల్పాలను పరిరక్షించుకోవాలి

పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



నరసరావుపేటఈస్ట్: పల్నాడుజిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం పరిధిలోని ముప్పాళ్ల మండలం మాదల గ్రామంలోని సకలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని చారిత్రక సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, మణిమేల శివశంకర్ ఇచ్చిన సమాచారం మేరకు డాక్టర్ శివనాగిరెడ్డి శనివారం మాదల గ్రామంలోని సకలేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడి చారిత్రక ఆనవాళ్లను పరిశీలించి ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలో క్రీ.శ 1125–1523 సంవత్సరాల మధ్య కాలానికి చెందిన 25 శాసనాలు గుర్తించినట్టు తెలిపారు. నాటి పాలకులైన కొండపడమటి, వెలనాటి చోళులు, కాకతీయులు, విజయనగరరాజుల కాలం నాటి శాసనాలలో సకలేశ్వర, కోటేశ్వర, త్రిపురాంతక, సాగరేశ్వర దేవాలయాలు, ఏడు చెరువుల నిర్మాణాలు, ఆలయాల నిర్వహణ, జీర్ణోద్ధరణ, దీపారాధనకు అవసరమైన నెయ్యి నిమిత్తం భూములు, జీవాల దాన వివరాలు ఉన్నాయని వివరించారు. ఆయా శాసనాలలో గ్రామం పేరు మామండల అని ఉందనీ, ఒక్క క్రీ.శ 1390 నాటి శాసనంలో మాత్రం మాందల అని ఉందన్నారు. కాలక్రమేన మాందల పేరు మాదలగా మారిందని తెలిపారు. ఆలయంలో చారిత్రక, అపురూప శిల్పాలైన నాగదేవతలు, మహిషాసురమర్దిని, గణపతి, భైరవ, కుమారస్వామి, వీరులు, దంపతుల శిల్పాలు, చారిత్రక ప్రాధాన్యత గల శాసనాలు నిర్లక్ష్యానికి గురై నేలపై పడి ఉన్నాయనీ, వాటిని పీఠాలపై నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అద్భుత శిల్పాలతో అలరారే 400 సంవత్సరాల నాటి కొయ్య రథం శిథిలమైపోతున్నదనీ, శిల్పాలకు రంగులు వేయటంతో ప్రాచీనతకు భంగం వాటిల్లుతున్నదనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వాటిని భద్రపరిచి పరిరక్షించాలని ప్రభుత్వానికి, ఆలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అడవులను సంరక్షించుకోవాలి

డీఎఫ్‌ఓ రామచంద్రరావు


అడవుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తున్న డీఎఫ్‌ఓ రామచంద్రరావు

నరసరావుపేటరూరల్: మొక్కలు నాటి అడవులను సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు. మండలంలోని యల్లమంద జెడ్పీ హైస్కూల్‌లో అటవీ రక్షణ, వన్యప్రాణి సంరక్షణపై అవగాహనలో భాగంగా పల్నాడు ప్రకృతి పాఠాలు కార్యక్రమాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామచంద్రరావు మాట్లాడుతూ భూమి ఉపరితలం మీద 9.4శాతం అడవులు ఆక్రమించి ఉన్నాయని తెలిపారు. వాతావరణంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అడవులు దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. వన్యప్రాణులను హింసించడం చట్టరీత్యా నేరం, వన్యప్రాణులకు హాని కలిగించిన వారికి పడే శిక్షలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జ్యోతికిరణ్, డీఈఓ రాము, పాఠశాల ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎంపిక

నరసరావుపేట: ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షులుగా చిలకలూరిపేట డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న పి.సుధాకర్, ప్రధానకార్యదర్శిగా నరసరావుపేటలో కండక్టర్‌గా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. శనివారం డిపో ఆవరణలో నిర్వహించిన ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్పీ రావు హాజరయ్యారు. జిల్లా చైర్మన్‌గా వినుకొండ డిపో కండక్టర్ ఏ.నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసరావుపేట సూపరింటెండెంట్ జి.రవికుమార్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా వినుకొండ కండక్టర్ పి.సుమన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరసరావుపేట కండక్టర్ కేవై ఏడుకొండలు, సంయుక్త కార్యదర్శిగా చిలకలూరిపేట డ్రైవర్ డీఎస్ రెడ్డి, కోశాధికారిగా నరసరావుపేట డిపో కండక్టర్ అంకమ్మరావు నియమితులయ్యారు. అనంతరం జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్.వి.శ్రీనివాసరావును కలిసి పరిచయం చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సదావకాశం

జిల్లా ఎగ్జిక్యూటివ్ అధికారి బెన్నీ

నరసరావుపేట: ప్రధానమంత్రి ఆహారశుద్ధి పరిశ్రమ స్థాపన కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేవారికి ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు ఉద్యానశాఖ జిల్లా అధికారి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీజే బెన్నీ పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లపై అవగాహన సమావేశం నిర్వహించారు. కేంద్రంలో మినీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందించే రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్పడాలు, వడియాలు, పచ్చళ్లు, పొడులు, బెల్లం, బేకరీలు, నూనె గానుగలు, పిండి మరలు లాంటి పరిశ్రమలు స్థాపనకు పదిశాతం పెట్టుబడి పెడితే మిగతా 90శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు రుణంతో అందిస్తాయన్నారు. దీనిలో 35శాతం రాయితీ నేరుగా బ్యాంకు రుణంకు జమ చేస్తారన్నారు. వీటిపై ఆసక్తి ఉన్న వారు ఉద్యానశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. దీనిపై మండలాలకు నియమించిన డీఆర్‌పీలు నరసరావుపేటకు షేక్ సాల్మా సెల్‌నం. 63003 31016, వినుకొండకు షేక్ రఫీ, సెల్.నం. 91774 05940, గురజాలకు కె.జోసెఫ్, సెల్.నం. 86881 56321లను సంప్రదించాలని కోరారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ధ్వంసానికి యత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన ఎర్రసాని లక్ష్మయ్య, జొన్నలగడ్డ నాగేశ్వరరావుతో పాటు పలువురు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు లిఖితపూర్వకంగా శనివారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సత్తెనపల్లి నుంచి యర్రగుంట్లపాడు వెళ్లే రోడ్డులో 2010వ సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ నిర్మాణం చేసుకున్నామన్నారు. విగ్రహ నిర్మాణ సమయంలో ప్రస్తుత ప్రతిపక్షపార్టీ అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. విగ్రహం పక్కనే బస్‌షెల్టర్ కూడా నిర్మాణం చేశామన్నారు. బస్‌షెల్టర్‌లో ఎస్సీలు కూర్చుంటున్నారు అనే ఉద్దేశంతో దానిని తొలగింపచేశారని ఆవేదన వ్యక్తపరిచారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి చేతి వేలు తొలగిపోయిందని, విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.